# వేగుచుక్క

VC NEWS

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ మార్చి 22 శనివారం 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 241

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




2లో

## లండన్‌లో ఎన్నారైలతో చిరు భేటీ



2లో

## తెలంగాణలో వడగళ్ల వానలు

### వాతావరణ కేంద్రం హెచ్చరిక

### పలు జిల్లాల్లో వడగళ్ల వానలు



తెలంగాణకు గ్రామీణ మౌలిక వసతుల నిధి(ఆర్ఐడీఎఫ్) కింద తక్కువ వడ్డీకి రుణాలు ఇవ్వాలని నాబార్డు (జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకు) ఛైర్మన్ కేవీ షాజీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు.

# తక్కువ వడ్డీకి రుణాలివ్వండి

హైదరాబాద్: తెలంగాణకు గ్రామీణ మౌలిక వసతుల నిధి(ఆర్ఐడీఎఫ్) కింద తక్కువ వడ్డీకి రుణాలు ఇవ్వాలని నాబార్డు (జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకు) ఛైర్మన్ కేవీ షాజీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. శాసనసభ ప్రాంగణంలోని కార్యాలయంలో శుక్రవారం సీఎంను షాజీ కలిశారు. ఈ సందర్భంగా జరిగిన భేటీలో సీఎం మాట్లాడుతూ... "తెలంగాణలో సహకార వ్యవస్థను బలోపేతం చేయాలి. ఈ మేరకు కొత్తగా మరిన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఏర్పాటు చేయాలి. కొత్త గ్రామ పంచాయతీల మధ్య అనుసంధానం పెంచేందుకు చర్యలు చేపట్టాలి. స్వయం సహాయక సంఘాల మహిళా గ్రూపులకు ప్రత్యేక పథకాన్ని రూపొందించాలి. ఇందిరా క్రాంతిపథం, గోదాములు, రైస్‌మిల్లులను నాబార్డుకు అనుసంధానం చేసి రాష్ట్రంలో మిల్లింగ్ సామర్థ్యం పెంచేందుకు సహకరించాలి. స్వయం సహాయక మహిళా సంఘాలు ఏర్పాటు చేస్తున్న సౌరవిద్యుత్ ప్లాంట్ల నిర్వహణలో నాబార్డు భాగస్వామిగా చేరాలి" అని కేవీ షాజీని కోరారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మంజూరైన నాబార్డు నిధులను ఈ నెల 31లోగా ఉపయోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. కొత్త జిల్లాలన్నింటిలోనూ డీసీసీబీలు ఏర్పాటు చేయాలని షాజీ సీఎంను కోరారు. సమావేశంలో నాబార్డు ఏజీఎం ఉదయ్‌భాస్కర్, వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

**ఆదర్శ రైతుల నియామకానికి వినతి**

రైతులకు మరింత మెరుగైన సేవలు అందించడానికి గ్రామాల్లో ఆదర్శ రైతు వ్యవస్థను, గ్రామీణ సాగునీటి పర్యవేక్షణ కోసం నీటి సంఘాలను ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి కోరారు. శుక్రవారం శాసనసభ ప్రాంగణంలో ఆయన తమ సభ్యులతో సీఎంను కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు.

**ముఖ్యమంత్రికి బీసీ కమిషన్ కృతజ్ఞతలు**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో బీసీ కమిషన్ శుక్రవారం ఆయన

మిగతా 2లో



2లో

## రాజకీయ లబ్ధికోసమే హిందీ వివాదం

- హిందీ ఏ భాషకూ వ్యతిరేకం కాదు
- తమిళంలో మెడికల్ , ఇంజనీరింగ్ విద్య మాలక్ష్యం
- కాశ్మీర్‌లో పరిస్థితులు దారికొస్తున్నాయి
- ఉగ్రవాద నిర్మూలనలో రాజీపడే ప్రసక్తి లేదు
- రాజ్యసభలో హోంమంత్రి అమిత్ షా వెల్లడి

**ఇంజినీరింగ్, వైద్య విద్య కోర్సులను తమిళంలో అందించాలని రెండేళ్లుగా కోరుతున్నా తమిళనాడు ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అమిత్ షా తెలిపారు. 'తమిళ మాధ్యమంలో వృత్తివిద్యా కోర్సులను అందుబాటులోకి తీసుకొస్తే మీ (డీఎంకేని ఉద్దేశిస్తూ) ఆర్థిక ప్రయోజనాలు నెరవేరవని భయపడుతున్నారు. భాజపా అధికారంలోకి వస్తే ఆ కోర్సులను తమిళ భాషలోనే అందిస్తాం'**



2లో

## హనీట్రాప్ వ్యవహారంపై దుమారం

# బొగ్గు ఉత్పత్తిలో గణనీయమైన ప్రగతి

**వందకోట్ల టన్నుల మైలురాయిని దాటిన భారత్**

**ఇంధనశక్తిలో స్వావలంబనకు నిదర్శనమన్న మోడీ**

**న్యూఢిల్లీ:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బొగ్గు ఉత్పత్తిలో 100 కోట్ల టన్నుల మైలురాయిని భారత్ దాటింది. ఇది దేశానికి గర్వ కారణమని ప్రధాని నరేంద్ర మోడీ శుక్రవారం అభివర్ణించారు. ఇంధన శక్తి భద్రత, స్వావలంబన విషయంలో దేశం నిబద్ధతకు ఇది సూచిక అని ప్రధాని మోడీ పేర్కొన్నారు. విద్యుత్ ఉత్పత్తిలోను, పలు పరిశ్రమల్లో ఇంధనంగా ప్రధానంగా ఉపయోగిస్తుండే బొగ్గు ప్రపంచ ఐదవ పెద్ద ఆర్థిక వ్యవస్థకు ప్రధాన ఇంధన వనరుగా ఉంటున్నది. భారత్ 2023-24 సంవత్సరంలో 997.83 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసింది. 'ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 100 కోట్ల టన్నుల మేరకు బొగ్గు ఉత్పత్తి చేయడాన్ని 'భారత్‌కు గర్వకారణం'గా ప్రధాని మోడీ సామాజిక మాధ్యమం 'ఎక్స్' పోస్ట్‌లో అభివర్ణించారు. '100 కోట్ల టన్నుల మైలురాయిని దాటడం గణనీయమైన విజయం. ఇంధన శక్తి భద్రత, ఆర్థిక వృద్ధి, స్వావలంబన పట్ల మన నిబద్ధతకుఇది ప్రతీక' అని ఆయన పేర్కొన్నారు. ఈ రంగంతో సంబంధం ఉన్న వారందరి అంకితభావాన్ని, గట్టి కృషిని ఇది ప్రతిబింబిస్తోందని మోడీ తెలిపారు. ఈ విజయం గురించి ప్రకటనతో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి



సామాజిక మాధ్యమంలో చేసిన పోస్ట్‌పై ప్రధాని మోడీ ఆ వ్యాఖ్య చేశారు. అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సమర్థ విధానాలతో భారత్ ఉత్పత్తిని హెచ్చించడమే కాకుండా సుస్థిర, బాధ్యతాయుత గనుల తవ్వకం జరిగేలా చూసిందని మంత్రి తెలిపారు.'ఈ విజయం పెరుగుతున్న మన విద్యుత్ డిమాండ్లను తీరుస్తుంది, ఆర్థిక వృద్ధికి దోహదం చేస్తుంది, ప్రతి భారతీయునికి సముజ్వల భవిష్యత్తును సాధ్యం చేస్తుంది' అని కిషన్ రెడ్డి సూచించారు.




2లో

## తెలంగాణలో ఆన్‌లైన్ గేమింగ్‌ను బ్యాన్

### సైబర్ సెక్యూరిటీ అడిషనల్ ఎస్పీ వెల్లడి

## ఆర్థిక వ్యవస్థను గాడిన పెడుతున్నాం



హైదరాబాద్: పదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన భారాస సర్కారు ప్రభుత్వ వ్యవస్థలను విధ్వంసం చేసిందని ఉప ముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. పదేళ్లలో రూ.16.70 లక్షల కోట్లు ఖర్చు చేసిందని.. అయినా ఒక్క నాగార్జునసాగర్, శ్రీశైలం, విమానాశ్రయం, ఓఆర్ఆర్ అయినా నిర్మించిందా అని ప్రశ్నించారు. శుక్రవారం అసెంబ్లీ, మండలిలో బడ్జెట్‌పై చర్చలో భాగంగా విపక్ష నాయకులు లేవనెత్తిన విమర్శలకు ప్రభుత్వం తరఫున భట్టి సమాధానమిచ్చారు. అంతకు ముందు కాంగ్రెస్ నాయకులకు బుద్ధిమాంద్యం అంటూ భారాస సభ్యుడు హరీశ్ చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గాలిలో మేడలు కట్టడం లేదని., అస్తవ్యస్తమైన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను తాము గాడిన పెడుతున్నామని, అన్నివర్గాల ప్రజల కోసం ప్రతిపైసా వెచ్చిస్తున్నామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. "రాష్ట్రంలో 2014 నుంచి 2023 నవంబరు వరకు భారాస పరిపాలన సాగింది. ఈ మధ్యకాలంలో రూ. లక్షల కోట్ల ఖర్చులు చూపించినా.. ఇంకా రూ. లక్షల కోట్ల బకాయిలు పెట్టారు. మరి భారాస ప్రభుత్వం ఈ రాష్ట్రానికి ఏం సాధించింది? కాళేశ్వరం ప్రాజెక్టు కట్టినా.. కనిపించకుండా చేసింది. పైగా 15 నెలల కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మీరేం చేశారని తిరిగి ప్రశ్నిస్తున్నారు.

అంచనాలకు, వాస్తవాలకు పొంతన లేదు భారాస ప్రభుత్వం పదేళ్ల బడ్జెట్‌లలో అంచనాలకు.. వాస్తవాలకు పొంతనలేదు. ఓఆర్ఆర్‌ను రూ.7,232 కోట్లకు 30 ఏళ్లకు లీజుకిచ్చారు. ఆబ్కారీ శాఖలో వచ్చే ఏడాదికి సంబంధించిన రూ.58,598 కోట్లు ముందే తీసుకున్నారు.

# అబద్ధాలతో పాలన సాగిస్తున్న రేవంత్ సర్కార్

**ఉచితంగా ఎల్ఆర్ఎల్ చేస్తామని మాటతప్పిన రేవంత్**

**రైతు రుణమాఫీలోనూ మోసాలు**

**అందరికీ అందని రైతు భరోసా సాయం**

**శాసన సభ చర్చల్లో మాజీమంత్రి హరీశ్‌రావు**

హైదరాబాద్: రేవంత్‌రెడ్డి సర్కార్ చెప్పేవన్నీ అబద్ధాలేనని, వారు ఒకటి చెప్తే ఇంకోటి చేస్తారని.. రాష్ట్రంలో గందరగోళ పరిస్థితి ఉందని మాజీమంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఎన్నికల ముందు మార్పు పేరుతో వాగ్దానాలు ఇచ్చారని, ఎన్నికల తర్వాత ఆ వాగ్దానాలను ఏమార్చరని అన్నారు. ఎన్నికల ముందు ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేస్తామన్నారని, ఇప్పుడేమో ఎల్ఆర్ఎస్ కోసం ప్రజల నుంచి ముక్కుపిండి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో రుణమాఫీకి రూ.31 వేల కోట్లు సమీకరించుకున్నట్లు చెప్పారని, రూ.20 వేల కోట్లు మాత్రమే మాఫీ చేసినట్లు ఒప్పుకున్నారని వెల్లడించారు. శాసన సభలో బడ్జెట్‌పై చర్చను హరీశ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ఏడాది బడ్జెట్ రూ.2 లక్షల 91 వేల 159 కోట్లు అని గొప్పగా చెప్పుకున్నారు. ఇవి అవాస్తవిక అంచనాలని నేను



ఆనాడే చెప్పాను. వారు కాదు పొమ్మన్నరు. రివైజ్డ్ ఎస్టిమేషన్‌లో రూ.27 వేల కోట్లు తక్కువ చేసి చూపారు. ముఖ్యమంత్రేమో రూ.60 నుంచి రూ.70 వేల కోట్లు తక్కువగా వస్తాయని స్వయంగా చెప్పారు. అంటే అంచనా అవాస్తవం అని తేలిపోయింది. ఈ కొటేషన్ ఎవరు చెప్పారోగానీ కాంగ్రెస్ కోసమే చెప్పారు. ఎన్నికలకు ముందు మార్పు పేరిట వాగ్దానాలు ఇచ్చారు. ఎన్నికలు అయ్యాక ఆ వాగ్దానాలనే ఏమార్చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో వడ్డీ లేని రుణాలకు సంబంధించి ఈరోజు వరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేసింది లేదు. వడ్డీ లేని రుణాల పరిమితిని గత ప్రభుత్వంలో మేం ఇచ్చిన 5లక్షలకు మించి పెంచింది లేదు. ఇదే శాసనసభలో మేము అడిగిన ప్రశ్నకు సమాధానంగా 5లక్షల వరకే వడ్డీ అందుతుందని ప్రభుత్వమే స్పష్టంగా చెప్పింది. 5లక్షల వరకే వడ్డీ లేని రుణాలు అని మీరే అన్నరు. మళ్లీ మీరే తీసుకున్న మొత్తం రుణానికి వడ్డీ లేని రుణం అని ప్రచారం చేసుకుంటున్నరు. నేను భట్టి గారిని సూటిగా అడుగుతున్నా. మహిళా సంఘాలు తీసుకున్న మొత్తం రుణానికి వీఎల్ఆర్ వర్తిస్తుంది అనే ఉత్తర్వులు ఉంటే చూపండి. లేదా ఈ సభను తప్పుదోవ పట్టించినందుకు, మహిళా లోకాన్ని మోసం చేసిందనందుకు భేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నా. ఎకరానికి రూ.15 వేలు చెల్లిస్తామన్న సంకల్పం ఏమైంది. రైతులు, కౌలు రైతులకు రైతు భరోసా, రైతు బీమా ఇస్తామని చెప్పారు. ఇప్పుడు కౌలు రైతులను రైతులే చూసుకోవాలంటున్నారు. ఈసారి బడ్జెట్‌లో అసలు కౌలు రైతుల ప్రస్తావనే లేదు. మహిళా సంఘాలకు స్కూల్ యూనిఫామ్స్ కుట్టుకూలీ రూ.50 నుంచి రూ.75కు పెంచి ఇచ్చినట్లు చెప్పారు. రూ.75 కుట్టు కూలీ ఇచ్చిన మహిళా సంఘం పేరు చెప్పాలని లేకపోతే క్షమాపణ చెప్పాలి. ఇందిరమ్మ ఇండ్లకు నిధులు కేటాయించినట్లు చెప్పారు. కాంగ్రెస్ పాలనలో 4.5 లక్షల ఇండ్లు కాదు కాదా.. 4 ఇండ్లు కూడా కట్టలేదు. ఎస్సీ, ఎస్టీల ఇండ్లకు రూ.లక్ష అదనంగా కలిపి రూ.6 లక్షలు ఇస్తామన్నారు.

వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...

# మూసీ ప్రక్షాళనకు నిధుల విడుదల చేయండి: ఈటెల

**న్యూఢిల్లీ:** మూసీ ప్రక్షాళన, మురుగునీటి శుద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు కేటాయించాలని మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ కోరారు. పార్లమెంట్ లో మాట్లాడిన ఆయన.. శుభ్రమైన తాగునీటి కోసం తెలంగాణకు నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగరంలో పట్టణీకరణ వేగంగా పెరిగిపోతుండటంతో.. నీటికి ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఇక, పెరుగుతున్న జనాభా అవసరాలను తీర్చడానికి రాష్ట్ర ప్రభుత్వాలు తగినంత మౌలిక సదుపాయాలు, సేవలను అందించడంలో ఇబ్బంది పడుతున్నాయని పేర్కొన్నారు. ఈ సవాళ్లను గుర్తించి కేంద్రం స్మార్ట్ సిటీ-స్, అమృత్ పథకాల కింద నిధులు ఇవ్వడం ఎంతో ప్రశంసనీయమైందన్నారు.

# తక్కువ వడ్డీకి రుణాలివ్వండి



రాష్ట్రంలో మిల్లింగ్ కెపాసిటీ పెంచేందుకు సహకరించాలని ముఖ్యమంత్రి అడిగారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మంజూరైన నాబార్డు స్కీమ్స్ నిధులు మార్చ్ 31వ తేదీలోగా ఉపయోగించుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. నాబార్డు పరిధిలోని స్కీములన్నింటినీ వచ్చే ఆర్థిక సంవత్సరంలో వీలైనంత ఎక్కువగా ఉపయోగించుకోవాలని సీఎం సూచించారు. స్వయం సహాయక మహిళా సంఘాలకు అందించే సోలార్ ప్లాంట్స్ నిర్వహణను నాబార్డుకు అనుసంధానం చేయాలని సూచించారు. కొత్త గ్రామపంచాయతీలకు రూరల్ కనెక్టివిటీ పెంచేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా కొత్త జిల్లాల్లో కొన్ని డీసీసీబీలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రికి నాబార్డు చైర్మన్ ప్రతిపాదించారు. ఈ సమావేశంలో నాబార్డు ప్రతినిధులతో పాటు తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

### సిఎంతో బిఆర్ఎస్ ఎమ్మెల్యేల భేటీ

హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీలోని సీఎం ఛాంబర్ లో రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ నేతలు హరీష్ రావు, పద్మారావు కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రితో అరగంటకు పైగా ఇద్దరు భేటీ అయ్యారు. ఇక, సమావేశం తర్వాత మాజీ మంత్రి హరీష్ రావు, పద్మారావు మీడియాతో చిట్ చాట్ చేశారు.

సికింద్రాబాద్ నియోజకవర్గంలో ఉన్న సమస్య కోసం సీఎం దగ్గరకు వెళ్ళాం.. మేము వెళ్లేసరికి సీఎం రూమ్ నిండా మంది ఉన్నారు.. 15 నిమిషాల పాటు రేవంత్ రెడ్డితో ఏమి మాట్లాడలేదు.. ఆ తర్వాత పద్మారావు నియోజకవర్గంలో కేసీఆర్ మంజూరు చేసిన హై స్కూల్, కాలేజీ పనులను వెంటనే ప్రారంభించాలి కోరాం.. సీఎం వెంటనే వేం నరేందర్ రెడ్డికి ఓ పేపర్ ఇచ్చి చేయమని చెప్పారు.. పద్మారావు రమ్మన్నాడు అని నేను కూడా వెళ్ళాను అని హరీష్ రావు చెప్పుకొచ్చారు. ఇక, డీ లిమిటేషన్ పై కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీలో పెట్టిన మీటింగ్ ను బహిష్కరించామని హరీష్ రావు తెలిపారు. చెన్నైలో జరిగే మీటింగ్ కాంగ్రెస్ ఆర్గనైజ్ చేయట్లేదు అని వెల్లడించారు. డీఎంకే పార్టీ వాళ్ళు పిలిచారు అని మేము వెళ్తున్నాం.. డీఎంకే మాకు ఫ్రెండ్లీ పార్టీ అని పేర్కొన్నారు. అయితే, కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై పీసీ ఘోష్ కమిటీ నివేదిక గురించి నాకు తెలియదు.. అది ఎప్పుడు వస్తుందో కూడా నాకు గుర్తు లేదు అని తేల్చి చెప్పారు. అలాగే, వీరితో పాటు మాజీ మంత్రి మల్లారెడ్డి ఫ్యామిలీ సైతం సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. మెడికల్ కాలేజీ సీట్ల పెంపు కోసం ముఖ్యమంత్రిని కలిసినట్లు- తెలిపారు.

# తెలంగాణలో ఆన్‌లైన్ గేమింగ్ బ్యాన్

**హైదరాబాద్:** తెలంగాణలో ఆన్‌లైన్ గేమింగ్‌ను బ్యాన్ చేశారు. బెట్టింగ్ యాప్స్ కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్యపై సరైన క్లారిటీ లేదని సైబర్ సెక్యూరిటీ బ్యూరో అడిషనల్ ఎస్పీ ప్రసాద్ అన్నారు. 2017 గేమింగ్ యాక్ట్ ప్రకారం తెలంగాణాలో ఆన్‌లైన్ గేమింగ్ బ్యాన్ అయింది.. మొత్తం 108 ఇల్లీగల్ యూఆర్ఎస్‌లను బ్లాక్ చేశాం.. చైనీస్ యూఆర్ఎల్‌లను ఫాలో కాకుండా అనేక ఇల్లీగల్ పంపుతున్నారు.. ప్రజలకు తమ మొబైల్స్ ద్వారా వచ్చే పాప్ అప్స్ పైనా సైబర్ క్రైమ్ కు ఫిర్యాదు చేస్తే వాటిని బ్లాక్ చేస్తామన్నారు. వేరు వేరు ప్రాంతల నుంచి ఫేక్ జీపీఎస్ ద్వారా జీయో ఫెన్సింగ్ యాక్సెస్ జరుగుతుంది.. స్కిల్ గేమింగ్ అని చెప్పే మాటలు అబద్దం.. గేమింగ్ ద్వారా నష్టపోయిన ఒక్క గెమింగ్ కంపెనీ లేదని పేర్కొన్నారు. అయితే, గేమింగ్ కంపెనీ ఏర్పాటు- చేసిన సాఫ్ట్ వేర్ వారు పన్నిన పన్నాగం మాత్రమే.. స్కిల్ గేమ్స్, ఆన్‌లైన్ గేమ్స్ కు దూరంగా ఉండాలి అని సైబర్ సెక్యూరిటీ బ్యూరో అడిషనల్ ఎస్పీ ప్రసాద్ సూచించారు. స్కిల్ గేమ్, నాన్ స్కిల్ గేమ్స్ తో సంబంధం లేదు.. ప్రతి గేమ్ వలన నష్టాలు ఉన్నాయి.. స్కిల్ గేమ్స్, నాన్ స్కిల్ గేమ్స్ పైనా లీగల్ అభిప్రాయాలు తీసుకుని ముందుకు వెళ్తామని చెప్పుకొచ్చారు. భారత చట్టాల ప్రకారం ఇన్‌ఫ్లుయెన్సర్లపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు.

# తెలంగాణలో వడగళ్ల వానలు

హైదరాబాద్: తెలంగాణలోని పలు చోట్ల ఉరుములు మెరుపులు, వడగళ్లతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఇదే సమయంలో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని పేర్కొంది. ఆదివారం కొన్ని జిల్లాల్లో ఇదే పరిస్థితి ఉండొచ్చని అంచనా వేసింది. కాకపోతే, ఈదురు గాలులు మాత్రం గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీస్తాయని పేర్కొంది. రాగల మూడు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సామాన్యంగా ఉండడంతో పాటు- క్రమంగా పెరిగే అవకాశాలున్నాయని వాతావరణ కేంద్రం సంచాలకులు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఇకపోతే ఎండలు మండిపోతున్న వేళ తెలంగాణలోని పలు జిల్లాల్లో అకాల వర్షం అకాల కురిసింది. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్‌లలో పలుచోట్ల వర్షం కురవగా.. మరికొన్నిచోట్ల వడగళ్లతో పడిన వానలకు పంటలు దెబ్బతిన్నాయి. నిజామాబాద్ జిల్లాలో ధర్పల్లి, ఇందల్వాయి మండలాల్లో వర్షం కురిసింది. ధర్పల్లిలోని వాడి గ్రామంలో వడగళ్ల వానకు వరిధాన్యం నేలరాలింది. మెదక్ పట్టణంలోని జంబికుంట వీధిలో ఓ ఇంటిపై పిడుగు పడింది. దీంతో సిద్ధయ్య అనే వ్యక్తి ఇంట్లో సామగ్రి ధ్వంసమైంది. ఆ సమయంలో మనుషులు ఎవరూ ఇంట్లో లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. కరీంనగర్‌లోని చొప్పదండి మార్కెట్లో మొక్కజొన్న తడిసిపోయింది. మెదక్ పట్టణం, మెదక్, పాపన్నపేట మండలాల్లో ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో కురిసిన వర్షానికి మామిడికాయలు నేలారాలాయి. సిద్ధిపేట జిల్లాలో దుబ్బాక, మిర్దొడ్డి, తొగుట మండలాల్లో వర్షం కురిసింది.




# రాజకీయ లబ్ధికోసమే హిందీ వివాదం



న్యూఢిల్లీ:రాజకీయంగా లబ్ధి పొందేందుకు, అవినీతిని దాచి పెట్టేందుకే కొన్ని పార్టీలు భాష అంశాన్ని వివాదం చేస్తున్నాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా దుయ్యబట్టారు. భాష పేరిట ఇప్పటికే దేశంలో చాలా వరకు విభజన వచ్చిందని, ఇకపై ఎంతమాత్రం జరగబోదని రాజ్యసభలో వ్యాఖ్యానించారు. దక్షిణాది భాషలకు కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకమని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని అమిత్‌షా మండిపడ్డారు. అలాగైతే తాను గుజరాత్ నుంచి, నిర్మలా సీతారామన్ తమిళనాడు నుంచి ప్రభుత్వంలో మంత్రులుగా ఎలా వ్యవహరిస్తున్నామని ప్రశ్నించారు. ఇంజినీరింగ్, మెడికల్ విద్యను తమిళంలో అందించాలని తమిళనాడు ప్రభుత్వానికి గత రెండేళ్లుగా కోరుతున్నా. దానివల్ల మీ ఆర్థిక ప్రయోజనాలు నెరవేరవని భయపడుతున్నారని డిఎంకెకు చురకలంటించారు. మేం అధికారంలోకి వస్తే మెడికల్, ఇంజినీరింగ్ విద్యను తమిళ భాషలోనే అందిస్తాంమని అమిత్‌షా అన్నారు. తమిళనాడు అసెంబ్లీకి వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్నాయి. హిందీ ఏ భాషకూ పోటీ కాదని, అన్ని భాషలకూ సోదర భాష అని పేర్కొనారు. ఈ మేరకు రాజ్యసభలో ఆయన వివిధ అంశాలపై సుదీర్ఘంగా మాట్లాడారు. తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వానికి, కేంద్ర ప్రభుత్వానికి మధ్య జాతీయ విద్యావిధానం, త్రిభాష అంశంపై వివాదం నెలకొన్న వేళ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కొన్ని పార్టీలు తమ సొంత రాజకీయ ప్రయోజనాల కోసం భాష అంశాన్ని వివాదం చేస్తున్నాయి. వారి అవినీతిని దాచుకునే ప్రయత్నిస్తున్నాయి. దేశంలోని అన్ని భాషలూ దేశానికి ఓ నిధి లాంటిది. హిందీ కూడా ఇతర భాషలకు సోదర భాషే అని అమిత్ షా అన్నారు. భాష పేరిట విభజన తీసుకొచ్చేందుకు చేపట్టే చర్యలేవీ ఫలించవన్నారు. మోదీ ప్రభుత్వం రాజ్యభాషా విభాగాన్ని ఏర్పాటు- చేసిందని చేశారు. తెలుగు, తమిళం, పంజాబీ, అస్సామీ.. ఇలా అన్ని భాషలనూ ప్రాచుర్యం కల్పించడం దీని ముఖ్య ఉద్దేశమని వివరించారు. ఇకపోతే ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదం పట్ల కఠిన వైఖరి అనుసరిస్తోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. కశ్మీర్‌లో ఇప్పుడు సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయని, అక్కడి యువకులు ఉద్యోగాలు చేసుకుంటు-న్నారని తెలిపారు. సినిమాహాళ్లు నిండుతున్నాయని వెల్లడించారు. గత ప్రభుత్వాల పనితీరుపై మండిపడ్డారు. అవి ఉగ్రవాదుల పట్ల మెతకవైఖరి అనుసరించాయని దుయ్యబట్టారు. జమ్మూకశ్మీర్, ఈశాన్య భారతంలోని ఉగ్రవాదం, తీవ్రవాదం దేశ వృద్ధికి ఆటంకాలు. వాటి వల్ల 92వేల మంది ప్రాణాలు కోల్పోయారు. మోదీ ప్రభుత్వ పాలనలో జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదం వల్ల మరణాలు 70 శాతం తగ్గాయి. ఉగ్రఘటనలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. ఆర్టికల్ 370ని రద్దు చేయడం ద్వారా 'ఒకే రాజ్యాంగం- ఒకే జెండా' అనే రాజ్యాంగ నిర్మాతల కలను మోదీ ప్రభుత్వం నెరవేర్చింది. ఇప్పుడు కశ్మీర్‌లో సాయంత్రం పూట కూడా సినిమాహాళ్లు తెరిచే ఉంటు-న్నాయి. జీ20 సమావేశాలు జరిగాయి. 2019 నుంచి 2024 వరకు అక్కడి యువతకు 40వేల ప్రభుత్వ ఉద్యోగాలు లభించాయి. స్వయం ఉపాధి పొందుతున్న వారి సంఖ్య, పెట్టు-బడులు పెరిగాయన్నారు. ఉరి, పుల్వామా ఘటనలు జరిగిన రోజుల వ్యవధిలో మెరుపు దాడులు,

వైమానిక దాడులు చేసిన ఈ ప్రభుత్వం పాకిస్థాన్‌కు గట్టి బదులిచ్చింది. అలాగే మార్చి 31, 2026 నాటికి వామపక్ష తీవ్రవాదం అంతమవుతుంది. రాజకీయ భావజాలం మద్దతున్న ఉగ్రవాదాన్ని విస్తరించకుండా అడ్డుకుంటాం. అలాగే రూ.1.25 లక్షల కోట్ల విలువైన డ్రగ్స్‌ను సీజ్ చేశామని కేంద్రహోంశాఖ పనితీరుపై చర్చ సందర్భంగా అమిత్ షా వెల్లడించారు.

# ప్రజాప్రతినిధుల కేసులపై హైకోర్టు విచారణ



**హైదరాబాద్:** ప్రజాప్రతినిధులపై కేసుల విచారణ పురోగతిపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ అంశంపై హైకోర్టు ప్రత్యేక ధర్మాసనం శుక్రవారం విచారించింది. మాజీ ఎంపీ హరిరామజోగయ్య దాఖలు చేసిన ప్రయోప్రయోజన వ్యాజ్యాన్ని కలిపి విచారణ జరిపింది. జగన్‌పై నమోదైన సీబీఐ, ఈడీ కేసులను వేగంగా విచారించాలని హరిరామజోగయ్య గతంలో ఫిర్యాదు చేశారు. తెలంగాణలోని వివిధ కోర్టుల్లో ప్రజాప్రతినిధులపై 309కి పైగా కేసులున్నాయని ఏఏజీ కోర్టుకు తెలిపారు. విచారణలో పురోగతిపై కౌంటర్ దాఖలకు సమయం కోరారు. విచారణ వేగవంతం చేయాలని హైకోర్టు ఆదేశించిందని హరిరామజోగయ్య తరఫు న్యాయవాది తెలిపారు. మార్చి 31వరకు ఉన్న కేసుల పురోగతి తెలపాలని ఏఏజీకి ఆదేశించిన ప్రత్యేక ధర్మాసనం.. అందుకు నాలుగు వారాల సమయం ఇచ్చింది.

## బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ప్రజల ప్రయోజనాలు పట్టవు

హైదరాబాద్: బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు వారి స్వప్రయోజనాలే ముఖ్యమని.. ఎన్నడూ రాష్ట్ర ప్రజల ప్రయోజాల గురించి పట్టించుకున్న పాపానపోలేదని మాజీమంత్రి కేటీఆర్ విమర్శించారు. ఒకవేళ తెలంగాణ ప్రజల గురించి ఆలోచిస్తే ఈపాటికే ఇంకా ఎంతో అభివృద్ధి సాధించేవారని అన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు ఎప్పటికీ ఓట్లు, సీట్లే ముఖ్యమని ఆ రెండు పార్టీలకు తెలంగాణ ప్రయోజనాలు, అభివృద్ధి, ఆకాంక్షలు పట్టవని విమర్శించారు. ఆ పార్టీల ప్రజాప్రతినిధులు కొత్త పరిశ్రమలు కావాలని అడగరని, ఉన్న పరిశ్రమలను ఉంచాలని కోరరని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూల్చే పనిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండగా, తూకానికి అమ్మే పనిలో కేంద్రంలోని బీజేపీ సర్కార్ ఉన్నాయని మండిపడ్డారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ పెట్టరని, ఆదిలాబాద్‌లో సీసీఐ ఫ్యాక్టరీ వేలానికి పెడ్తరని ధ్వజమెత్తారు

. అందుకే మంటికైనా ఇంటోడే కావాలని ఊరికే అనలేదన్నారు. 'బయ్యారంలో ఉక్కు పరిశ్రమ పెట్టరు... ఆదిలాబాద్‌లో సీసీఐ ఫ్యాక్టరీ వేలానికి పెడ్తరు. బీజేపీ నుంచి ఎనిమిది మంది ఎంపీలు, ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఒక్కరూ నోరు తెరిచి దీని గురించి మాట్లాడరు. కాంగ్రెస్ నుంచి ఎనిమిది మంది ఎంపీలు, 64 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఒక్కరూ ఈ అన్యాయాన్ని ప్రశ్నించరని నిలదీశారు. ఈ కాంగ్రెస్, బీజేపీలకు ఎప్పటికీ ఓట్లు, సీట్లే ముఖ్యం. తెలంగాణ ప్రయోజనాలు, తెలంగాణ అభివృద్ధి, తెలంగాణ ఆకాంక్షలు ఈ పార్టీలకు పట్టవు.' అని కేటీఆర్ విమర్శించారు.

# హనీట్రాప్ వ్యవహారంపై దుమారం

బెంగళూరు: కర్ణాటకలో మంత్రులు సహా అనేక మంది ముఖ్యనేతలే లక్ష్యంగా కొనసాగుతోన్న 'హనీ ట్రాప్'వ్యవహారం తీవ్ర దుమారం రేపుతోంది. జాతీయ స్థాయి నేతలు సహా 48 మంది రాజకీయ నాయకులు ఇందులో బాధితులుగా ఉన్నారంటూ ఓ మంత్రి చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టించాయి. దీనిపై శుక్రవారం కర్ణాటక అసెంబ్లీ దద్దరిల్లింది. సమావేశాల వేళ ప్రతిపక్ష భాజపా నేతలు ఈ అంశాన్ని లేవనెత్తడంతో తీవ్ర గందరగోళ వాతావరణం నెలకొంది. దాంతో సభా కార్యక్రమాలకు అడ్డుపడిన 18 మంది భాజపా ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ విధిస్తూ తీర్మానం చేశారు. ఆరు నెలల పాటు వారిపై సస్పెన్షన్ వేటు వేస్తున్నట్లు స్పీకర్ వెల్లడించారు. సస్పెన్షన్ ఉత్తర్వుల ప్రకారం.. వేటుకు గురైన సభ్యులు అసెంబ్లీ హాల్, లాబీ, గ్యాలరీలోకి ప్రవేశించకూడదు. వారు ఏ స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో పాల్గొనకూడదు. అసెంబ్లీ ఎజెండాలో వారి పేర్లతో ఎలాంటి అంశం లిస్ట్ కాకూడదు. ఈ సమయంలో వారికి రోజూవారీ భత్యాలు కూడా అందవు. ఇక సస్పెండైన ఎమ్మెల్యేలను మార్షల్స్ బలవంతంగా బయటకు తరలించారు. దీనిపై బిజెపి తీవ్రంగా స్పందించింది. విచారణ కోరితే సస్పెన్షన్ వేటు వేయడం, అదికూడా ఆరునెలలు వేయడం దారుణమన్నారు. సిద్దరామయ్య నిరంకుశ పాలనకు నిదర్శనమన్నారు. ప్రభుత్వం నిజాలు

దాస్తోందని విమర్శించారు. సంచలనంగా మారిన 'హనీ ట్రాప్' వ్యవహారాన్ని శుక్రవారం సభలో భాజపా నేతలు లేవనెత్తారు. దీనిపై సీబీఐ దర్యాప్తు చేయాలని వారు డిమాండ్ చేశారు. హనీ ట్రాప్‌పై విచారణను పక్కనపెట్టి ప్రభుత్వం ముస్లిం కోటా బిల్లును పాస్ చేయడాన్ని విమర్శిస్తూ.. స్పీకర్ వద్దకు వెళ్లి నిరసన తెలిపారు. భాజపా నేతల తీరుపై రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆగ్రహం వ్యక్తంచేశారు.

# వివేకా హత్య కేసు విచారణలో కీలక పరిణామం

**సిబిఐని ప్రతివాదిగా చేర్చాలని సునీత వినతి**

**కేసు విచారణపై తెలంగాణ హైకోర్టులో పిటిషన్**



హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసు విచారణలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు విచారణపై తెలంగాణ హైకోర్టులో వివేకా కుమార్తె సునీత పిటిషన్ దాఖలు చేశారు. ఇందులో ఆమె సీబీఐని ప్రతివాదిగా చేర్చారు. సీబీఐ కోర్టులో తన తండ్రి హత్య కేసును రోజువారీగా విచారించేలా ఆదేశించాలని పిటిషన్‌లో ఆమె కోరారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు ప్రత్యేక ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రస్తుతం ఈ కేసు సీబీఐ కోర్టులో విచారణలో ఉన్న విషయం తెలిసిందే. ఇప్పటికే దాదాపు నాలుగేళ్లుగా ఈ కేసు విచారణ కొనసాగుతున్నా.. పురోగతి ఏమీ లేదని సునీత తన పిటిషన్‌లో పేర్కొన్నారు. హైకోర్టులో విచారణ సందర్భంగా సునీత తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. 2019 మార్చి 14న అర్ధరాత్రి ఈ హత్య చోటు- చేసుకుందని.. సీబీఐ అధికారులు విచారణ
చేపట్టి ఇప్పటికే రెండు ఛార్జిషీట్‌లు దాఖలు చేశారన్నారు. ఇంకా సీబీఐ కోర్టులోనే విచారణ కొనసాగు తోందని.. దీన్ని ఆరు నెలల్లోగా ముగించేలా కోర్టును ఆదేశించాలని హైకోర్టును కోరారు. సీబీఐ అధికారులు ఇప్పటికే కొన్ని పత్రాలకు సంబంధించి హార్డ్ డిస్క్‌లో ప్రతివాదుల తరఫు న్యాయవాదులకు ఇచ్చారనీ.. అయితే, హార్డ్‌డిస్క్‌లో ఉన్న కాపీలు ఓపెన్ కావడంలేదు గనక నేరుగా ప్రింటింగ్ ప్రతులు కావాలని వారు కోరిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే, లక్షల సంఖ్యలో పేజీలు ఉండటంతో ప్రింటింగ్‌కాపీలు ఇవ్వడం కుదరదు గనక హార్డ్ డిస్క్‌లను ఓపెన్ చేయాలని సీబీఐ అధికారులు చెబుతుండటంతో.. దాదాపు 15 నెలలుగా విచారణ ముందుకు సాగడంలేదని సునీత న్యాయవాది కోర్టుకు తెలిపారు. అయితే, సునీత ప్రధానంగా సీబీఐ అధికారులతో పాటు- తన తండ్రి హత్య కేసులో నిందితులుగా ఉన్నవారందరినీ ప్రతివాదులుగా చేర్చారు. ఈ అంశంపై విచారణ జరిపిన ప్రత్యేక ధర్మాసనం సీబీఐతో పాటు- ఈ కేసులో నిందితులందరికీ నోటీ-సులు వ్యక్తిగతంగా నోటీ-సులు ఇచ్చేందుకు సునీత న్యాయవాదికి అనుమతి ఇచ్చింది.

# జాతీయ గీతాన్ని అవమానపర్చిన నితీష్



**పాట్నా:** బీహార్ సీఎం నితీశ్ కుమార్ జాతీయ గీతాన్ని అగౌరవపర్చారు. జాతీయ గీతం ఆలపిస్తున్న సమయంలో పక్కనున్న వారితో మాట్లాడేందుకు ఆయన ప్రయత్నించారు. అలాగే సైగలు చేశారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో సీఎం నితీశ్ కుమార్ తీరుపై ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ మండిపడ్డారు. జాతీయ గీతాన్ని ఆయన అగౌరవపర్చడంపై క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. 'బీహార్ సీఎం నితీశ్ కుమార్ నిన్న జాతీయ గీతాన్ని అగౌరవపరిచారు. 'బీహారీ'గా నేను సిగ్గుపడుతున్నా. ఈ సంఘటన చాలా దురదృష్టకరం. సీఎం నితీశ్ కుమార్ పదవీ విరమణ చేయాలి' అని మీడియాతో అన్నారు. కాగా, బీహార్ మాజీ సీఎం, ఆర్జేడీ నాయకురాలు రబ్రీ దేవి కూడా ఈ సంఘటనపై స్పందించారు. 'ఆయన (బీహార్ సీఎం నితీశ్ కుమార్) మానసిక స్థితి సరిగా లేదు. ఆయన మనసు పని చేయకపోతే తన కొడుకును ముఖ్యమంత్రిని చేయాలని డిమాండ్ చేస్తున్నాం' అని అన్నారు. మరోవైపు సీఎం నితీశ్ కుమార్ ఆరోగ్య, మానసిక పరిస్థితిపై ఆర్జేడీ ఎంపీ మిశా భారతి పలు అనుమానాలు వ్యక్తం చేశారు. రోజూ మహిళలను, పిల్లలను ఆయన అవమానిస్తున్నారని ఆరోపించారు.

వేగుచుక్క

# తెలంగాణ అభివృద్ధి అయింది.. కానీ ప్రజలు అభివృద్ధి కాలేదు.

**తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఉపాధ్యక్షులు ఇ. పురుషోత్తం.**

**రాష్ట్ర బడ్జెట్ 2025-26 విశ్లేషణ అనే అంశంపై టియులో సెమినార్.**

**వేగుచుక్క న్యూస్, డిచ్ పల్లి, మార్చి 21:**





తెలంగాణ అభివృద్ధి అయింది.. కానీ ప్రజలు అభివృద్ధి కాలేదనీ తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఉపాధ్యక్షులు ఇ. పురుషోత్తం అన్నారు. తెలంగాణ విశ్వవిద్యాలయంలో డిపార్ట్మెంట్ ఆఫ్ అప్లైడ్ ఎకనామిక్స్ విభాగాధిపతి డాక్టర్ ఏ పున్నయ్య అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ 2025-26 విశ్లేషణ అనే అంశంపై శుక్రవారం సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్ కు ముఖ్యఅతిథిగా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్, ఆచార్య టి. యాదగిరిరావు, గౌరవ అతిథులుగా రిజిస్ట్రార్ ఆచార్యయం యాదగిరి, ప్రత్యేక ఆహ్వానితులుగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రవీణ్ మామిడాల, బిజయ్ కుమార్ సాహూ ఎస్ బి ఐ డీజీఎం, కీలక ఉపన్యాసం చేయడానికి తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఉపాధ్యక్షులు ఆచార్య. ఇ. పురుషోత్తం హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ముఖ్యఅతిథి వైస్ ఛాన్సలర్ ఆచార్య టి. యాదగిరిరావు మాట్లాడుతూ, 2025 -26 సంవత్సరానికి గాను ఈ ప్రభుత్వం రూ. 3,04,965 కోట్లు బడ్జెట్ ను ప్రవేశపెట్టిందన్నారు. ఈ కేటాయింపులు విధ్వంసం నుంచి వికసిత భారత్ లక్ష్యంగా రాష్ట్ర పురోగతి ఉంటుందని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎం. యాదగిరి మాట్లాడుతూ, సమగ్ర మరియు స్థిరమైన అభివృద్ధికి ఈ బడ్జెట్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. రెవెన్యూ ఎక్స్పెండిచర్ కంటే క్యాపిటల్ ఎక్స్పెండిచర్ అధికంగా ఉన్నప్పుడే రాష్ట్రం పురోగతి దిశగా అడుగులు వేస్తుందని పేర్కొన్నారు. ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ఆచార్య ఈ పురుషోత్తం కీలకోపన్యాసం చేస్తూ, తెలంగాణ అభివృద్ధి జరిగింది కానీ తెలంగాణ ప్రజలు అభివృద్ధి జరగలేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి విద్యారంగం మీద మనస్సు కేంద్రీకరించినారని విద్యకు గతంలో ఎన్నడు లేని విధంగా రూ. 23,108 కోట్లు కేటాయించిందని, ఇది గతం కంటే రూ. 1816 కోట్లు అధికమన్నారు. ఉన్నత విద్యారంగాన్ని అభివృద్ధి పదంలో ముందుకు తీసుకుపోవడానికి అభివృద్ధి పద్ధతి కింద రూ. 500 కోట్లు కేటాయించడంతో ఉన్నత విద్యా రంగంలో బోధనా పరిశోధన వసతులు మెరుగయితాయని పేర్కొన్నారు. విద్యారంగ అభివృద్ధికి 58 ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను అన్ని వసతులతో ఏర్పాటు చేయడానికి ప్రభుత్వ నడుంబిగించిందని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయాలను బలోపేతం చేయాలని సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విశ్వవిద్యాలయాల ఆచార్యుల పదవీ విరమణ వయసు 65 సంవత్సరాలకు పెంచినారని పేర్కొన్నారు. ఉన్నత విద్యారంగంలో పాఠ్యప్రణాళికలో మార్పులకు ఉన్నత విద్యా మండలి నడుం బిగించిందని పేర్కొన్నారు. రాబోయే విద్యా సంవత్సరం ప్రతి కోర్స్ కు ఇంటర్న్ షిప్ ప్రవేశపెట్టనున్నామని తెలిపారు. త్వరలో విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. అకాడమిక్ కన్సల్టెంటా సర్వీసును క్రమబద్ధీకరించడానికి ఉన్నత విద్యా మండలి కృషి చేస్తుందని పేర్కొన్నారు. అవుట్సోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను సమీక్షించి ప్రభుత్వానికి నివేదించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న ఎస్బిఐ, డీజీఎం బిజయ్ సాహు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ పొదుపు ప్రవృత్తిని పెంచుకోవాలని, జీవిత బీమా మరియు డిపాజిట్లు పెంచుకొని ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిలో భాగం పంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్న ప్రిన్సిపల్ డాక్టర్ ప్రవీణ్ మామిడాల మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ కూర్పులో తెలంగాణ విశ్వవిద్యాలయంలోని విద్యార్థుల భాగస్వామ్యం ఉండే విధంగా విద్యార్థులు ఎదగాలని ఆకాంక్షించారు.



అనంతరం ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ను వైస్ ఛాన్సలర్ ఆచార్య టి. యాదగిరిరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎం యాదగిరి, తెలంగాణ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (టూ టా) డాక్టర్ అడిగే నాగరాజ్, డాక్టర్ వాసం చంద్రశేఖర్, డాక్టర్ మావురపు సత్యనారాయణ రెడ్డి, డాక్టర్ బోయపాటి శిరీష, ఆచార్య కనకయ్య లు, కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ డా. దత్త హరి, డాక్టర్ రామలింగం, డాక్టర్ నరసయ్య, డాక్టర్ గంగా కిషన్, డాక్టర్ కిరణ్ రాథోడ్లు, ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ బాధ్యులు పూల బొకే శాలువాతో సన్మానించినారు. ఈ సెమినార్ లో చైర్మన్ బి ఓ ఎస్ డా.టి. సంపత్ ప్రొఫెసర్ రవీందర్ రెడ్డి, డా.నాగరాజు పాత, డాక్టర్ ఎన్ స్వప్న, డా. సిహెచ్ శ్రీనివాస్, డా. దత్త హరి పాల్గొన్నారు.

# పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, మార్చి 21 :**



ఆర్మూర్ మండలం పెర్కిట్ లో గల ప్రభుత్వ ఉర్దూ మీడియం స్కూల్, మహాత్మా జ్యోతిబాపూలే బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉర్దూ మీడియం స్కూల్ లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు, ఇతర సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా అని పరిశీలించారు. కంప్యూటర్ ల్యాబ్ ను సందర్శించి క్లాసులను పరిశీలించారు. విద్యార్థినుల విద్యావిషయక సామర్థ్యాన్ని పరీక్షించారు. జ్యోతిబాపూలే పాఠశాలలో కిచెన్, డైనింగ్ హాల్, స్టోర్ రూంలను సందర్శించి, బియ్యం నిల్వలు, కూరగాయల నాణ్యతను, సరుకుల స్టాక్ ను పరిశీలించారు. కాల పరిమితి ముగిసిన వాటిని వినియోగించకూడదని నిర్వాహకులకు సూచించారు. పాఠశాల సముదాయాన్ని, తరగతి గదులను పరిశీలించిన కలెక్టర్, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆహార పదార్థాలు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మెనూ పట్టికను పరిశీలించి, విద్యార్థినులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని సూచించారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ ఆర్డీఓ రాజాగౌడ్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆశ్వాఖుల్లా, ముక్తార్ సింగ్, సృజన, స్థానిక అధికారులు ఉన్నారు.

# ఎస్సెస్సీ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్.



**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, మార్చి 21**

: పదవ తరగతి వార్షిక పరీక్షలు శుక్రవారం నుండి ప్రారంభమవగా, తొలి రోజునే కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పరీక్షా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్మూర్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. పరీక్షల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. విద్యార్థుల హాజరు, సిబ్బంది హాజరు గురించి ఆరా తీశారు. నిబంధనలకు అనుగుణంగానే నిర్ణీత సమయంలో ప్రశ్న పత్రాలను తెరిచారా? స్ట్రాంగ్ రూం ల నుండి ఎన్ని గంటలకు ప్రశ్న పత్రాలు కేంద్రానికి చేరుకున్నాయి, ఆ సమయంలో పోలీస్ ఎస్కార్ట్ ఉందా? తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి వసతి అందుబాటులో ఉందా? లేదా? అని గమనించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సజావుగా పరీక్షలు జరిపించాలని చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటల్ అధికారులకు సూచించారు. ఎక్కడ కూడా కాపీయింగ్ కు ఆస్కారం ఉండకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఎలాంటి తప్పిదాలకు అవకాశం ఇవ్వకుండా, పక్కాగా పరీక్షలు జరిపించాలని అన్నారు. కాగా, జిల్లాలో 22,774 మంది విద్యార్థిని, విద్యార్థులకు గాను తొలి రోజున 22,715 మంది పరీక్షకు హాజరయ్యారని, 59 మంది గైర్హాజరు అయ్యారని కలెక్టర్ వివరించారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ ఆర్డీఓ రాజాగౌడ్, పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ కవిత ఉన్నారు.

# త్రాగునీటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు.

- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ.

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, మార్చి 21:**



ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలతో నీటి సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ తో కలిసి కామారెడ్డి పట్టణం, నియోజకవర్గం లో త్రాగునీటి సమస్య పై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ వేసవి కాలంలో ప్రజలకు త్రాగునీటి సమస్యలు రాకుండా చూడాలని తెలిపారు. త్రాగునీటి సమస్య పరిష్కరించే దిశగా అధికారులు చేయాలు తీసుకోవాలని అన్నారు. సమస్యలు ఉత్పన్నం కాకముందే ముందస్తు చర్యలు చేపట్టాలని అన్నారు. కామారెడ్డి మున్సిపల్ ఏరియాలో అవసరం మేరకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని సూచించారు. మిషన్ భగీరథ, మున్సిపల్, పంచాయతీ రాజ్ శాఖల ద్వారా చేపడుతున్న పనులపై ఆయన సమీక్షించారు. మిషన్ భగీరథ ద్వారా చేపట్టే పైప్ లైన్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. మున్సిపల్ ఏరియాలో రోజుకు రెండు సార్లు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. పట్టణంలో 33/11 కే.వి. అండర్ గ్రౌండ్ సబ్ స్టేషన్ నిర్మాణానికి అవసరమైన భూమిని గుర్తించి కేటాయించాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ, త్రాగునీటి అవసరాలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, గ్రామ పంచాయతీ నిధులను వినియోగించుకోవాలని, అవసరమేరకు ఉన్నతాధికారులకు వివరించి నిధుల కోసం ప్రతిపాదనలు సమర్పించాలని తెలిపారు. మిషన్ భగీరథ పైప్ లైన్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కోరారు. కామారెడ్డి పట్టణంలో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని, రంజాన్ పండుగ నేపథ్యంలో రోజుకు రెండుసార్లు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పట్టణంలో 33/11 కే.వి. సబ్ స్టేషన్ కోసం అవసరమైన భూమిని గుర్తించాలని అదనపు కలెక్టర్ కు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు వి.విక్టర్, శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమీషనర్ రాజేందర్ రెడ్డి, మిషన్ భగీరథ, పంచాయతీ రాజ్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# టియు విద్యార్థుల కోసం ఎస్బిఐ "అంబులెన్స్" సౌకర్యం.

**వేగుచుక్క న్యూస్, డిచ్ పల్లి, మార్చి 21:**




తెలంగాణ యూనివర్సిటీ విద్యా ర్థుల సౌకర్యార్థం ఎస్బిఐ తెలంగాణ యూనివర్సిటీ బ్రాంచ్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ( సి ఎస్ ఆర్ ) పథకంలో భాగంగా శుక్రవారం రూ. 8,11,276 విలువైన అంబులెన్స్ ను అందించింది. తెలంగాణ విశ్వవిద్యాలయ విద్యార్థుల సౌకర్యార్థం అంబులెన్సు అందిం చడం జరిగిందని డివిజనల్ జనరల్ మేనేజర్ బీజయ కుమార్ సాహు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య టి. యాదగిరిరావు మాట్లాడుతూ, విశ్వవిద్యాలయ విద్యార్థులకు అనారోగ్య పరిస్థితులు ఉన్నప్పుడు అంబులెన్స్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఇందుకు ఎస్బిఐ ఉన్నతాధికారులకు తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్, అధ్యాపకులు విద్యార్థిని, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రేమానురాగాలతో "డౌన్ సిండ్రోమ్" పిల్లల్లో మార్పు.



**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి పద్మావతి.**

**స్నేహ సొసైటీలో ప్రపంచ డౌన్ సిండ్రోమ్ దినోత్సవం.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మార్చి 21:**




తల్లిదండ్రులు తమ ప్రేమానురాగాలతో "డౌన్ సిండ్రోమ్" పిల్లల్లో మార్పు సాధ్యం అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి పద్మావతి అన్నారు. డౌన్ సిండ్రోమ్ పిల్లలు పుట్టడానికి నివారణ చర్యలు లేవని, గర్భ విచ్ఛిత్తి మాత్రమే మార్గమని తెలిపారు. శుక్రవారం స్థానిక మారుతి నగర్ లోని స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రే కన్స్ట్రక్షన్ ఆధ్వర్యంలో ప్రపంచ డౌన్ సిండ్రోమ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జ్ పి పద్మావతి పాల్గొని ప్రసంగించారు. డౌన్ సిండ్రోమ్ పిల్లల పట్ల చిన్నచూపు చూడవద్దని కోరారు. ఒక కుటుంబంలో ఇద్దరు పిల్లలు ఉన్నట్లయితే ఇద్దరు పిల్లలకు సమానమైన తెలివితేటలు ఉండవని, అట్లాగే డౌన్ సిండ్రోమ్ పిల్లలు కొంచెం తెలివి తక్కువగా ఉంటారని, వారికి విద్యాబుద్ధులు నేర్పించాలని కోరారు. డౌన్ సిండ్రోమ్ పిల్లల అభ్యున్నతికి జ్యోతి సిద్దయ్యలు స్నేహ సొసైటీని ఏర్పాటు విద్యాబుద్ధులు నేర్పి వారి అభ్యున్నతికి కృషి చేయడాన్ని అభినందించారు. పిల్లలు వారు వేసిన డ్రాయింగ్స్ మరియు పెయింటింగ్స్ చాలా బాగున్నాయి అని, నార్మల్ పిల్లలు కంటే కూడా బాగా వేశారని వారిని అభినందించారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా విచ్చేసిన జిల్లా సంక్షేమ అధికారి రసూల్ బి మాట్లాడుతూ, డౌన్ సిండ్రోమ్ పిల్లలు దేవుడిచ్చిన వరమని తల్లిదండ్రులు భావించినప్పుడు ఆ పిల్లల అభివృద్ధి సక్రమంగా జరుగుతుందని, ఇలాంటి పిల్లలను ప్రత్యేక పాఠశాలలో చేర్పించినప్పుడు వారు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతారని అన్నారు. స్నేహ సొసైటీలోని పిల్లలు యోగా, డాన్స్, డ్రాయింగ్ చేశారనీ, ఇంకా ఎన్నో రంగాల్లో ముందున్నారని వారికి విద్యాబుద్ధులు అందించిన స్నేహ సొసైటీని ఆమె అభినందించారు.

**సీనియర్ వైద్యులు డాక్టర్ ప్రతిమ రాజ్ మాట్లాడుతూ...**

స్త్రీ పురుషుల్లో 23 జతల క్రోమోజోములు ఉంటాయని 21వ క్రోమోజోములోని ట్రైజోమ్ వల్ల డౌన్ సిండ్రోమ్ పిల్లలు పుడతారని, ఒక క్రోమోజం అధికంగా ఉండటం వల్ల డౌన్ సిండ్రోమ్ పిల్లలు పుడతారన్నారు. డౌన్ సిండ్రోం పిల్లల్లో సాధారణంగా మైల్ స్టోన్స్ అన్ని ఆలస్యంగా అభివృద్ధి చెందుతాయని, కానీ వారికి సహకారాన్ని అందిస్తే వారు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతారని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఇన్నమూరి రవితేజ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ అవినాష్ లు పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్దయ్య, అందుల పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి, మానసిక దివ్యాంగుల పాఠశాల ప్రిన్సిపల్ రాజేశ్వరి పిల్లల తల్లిదండ్రులు మానసిక మానసిక వికలాంగ విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు. డ్రాయింగ్ అండ్ పెయింటింగ్ పోటీల్లో పాల్గొన్న డౌన్ విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు.

# ఏతిక్స్, డిసిప్లేన్ జాతీయ కమిటీ చైర్మన్ గా ఈగ సంజీవరెడ్డి.

- రాష్ట్ర అర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అరవింద్ వెల్లడి.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మార్చి 21:**

అర్చరీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఏతిక్స్ మరియు డిసిప్లేన్ చైర్మన్ గా జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు, అర్చరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఈగ సంజీవరెడ్డి నీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర అర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అరవింద్ శుక్రవారం ఒక్క ప్రకటనలో తెలిపారు. ఈగ సంజీవరెడ్డి ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఏతిక్స్ మరియు డిసిప్లేన్ చైర్మన్ ఎంపిక పట్ల జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ చైర్మన్ అంద్యాల లింగయ్యా, ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య, భూమారెడ్డి, ఉపాధ్యక్షులు భక్త వత్సలం, ప్రవీణ్ రెడ్డి, గాధరి సంజీవ్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులు విజయ కాంత్ రావ్, రాజగౌడ్, అబ్దుల్ ఒమార్ మరియు మనోజ్ కుమార్, సురేష్, రమేష్, అబ్బన్న, జావీద్, పలు క్రీడా సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.



వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...

# లుక్ చూశారా?



మహేష్ బాబు-రాజమౌళి సినిమా షూటింగ్ ఒడిశాలో జరుగుతున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ షెడ్యూల్‌ని విజయవంతంగా పూర్తి చేశారు. షూటింగ్ పూర్తి కాగానే అక్కడి లోకల్ అధికారులు టీమ్‌తో ఫొటోలు తీసుకున్నారు. అలానే రాజమౌళి ఓ థాంక్యూ నోట్ కూడా రాశారు. ఇక ఈ ఫొటోల్లో మహేష్ బాబు లుక్ చూసి ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. మరోవైపు సోషల్ మీడియాలో ఓ వార్‌కి రాజమౌళి ఆ నోట్ ద్వారా ఫుల్ స్టాప్ పెట్టారు. ఎస్ఎస్ రాజమౌళితో మహేష్ బాబు చేస్తున్న సినిమా షూటింగ్ కొన్నిరోజులుగా ఒడిశాలోని కోరాపుట్‌లో జరుగతుంది. తాజాగా ఈ సినిమాకి సంబంధించిన ఈ షెడ్యూల్ పూర్తయింది. దీంతో పలువురు అధికారులు, అభిమానులు టీమ్‌ని కలిసి వారితో ఫొటోలు తీసుకున్నారు. ఈ ఫొటోల్లో రాజమౌళి, మహేష్ బాబు, ప్రియాంక చోప్రా కూడా ఉన్నారు. అలానే రాజమౌళి రాసిన థ్యాంక్యూ నోట్ కూడా వైరల్ అవుతోంది.


కొన్నాళ్ల క్రితం హైదరాబాద్‌లో SSMB29 షూటింగ్ మొదలైంది. కానీ మూవీ టీమ్ మాత్రం అధికారికంగా ప్రకటించలేదు. ఇక ఒడిశాలోని కోరాపుట్ కొండలపై తీసిన ఈ షెడ్యూల్‌లో మహేష్ బాబు, పృథ్వీరాజ్ సుకుమారన్, ప్రియాంక చోప్రా తదితరులపై కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. ఇందుకు సంబంధించిన ఓ వీడియో కూడా ఆ మధ్య లీకైంది. అయితే సోషల్ మీడియాలో ఈ సినిమాపై ఓ మినీ సైజు యుద్ధమే జరుగుతుంది.

చాలా మంది యాంటీ ఫ్యాన్స్ ఈ సినిమా SSMB29 (సూపర్ స్టార్ మహేష్ బాబు 29) కాదని (ఎస్ఎస్ రాజమౌళి మహేష్ బాబు) లేదా (ఎస్ఎస్ రాజమౌళి 13) అంటూ పిలవాలని పోస్టులు పెడుతున్నారు. దీనిపై మహేష్ బాబు ఫ్యాన్స్ ఫైర్ అవుతున్నారు. ఇలాంటి వేళ ఈ షెడ్యూల్ పూర్తయిన తర్వాత అక్కడి వారికి రాసిచ్చిన థాంక్యూ నోట్‌లో రాజమౌళి SSMB29 అంటూ మెన్షన్ చేశారు.

"డియర్ కోరాపుట్.. మీ ఆతిథ్యానికి చాలా కృతజ్ఞతలు. ఇలా మరిన్ని అడ్వెంచర్స్ చేసేందుకు మళ్లీ ఇక్కడికి వస్తాం. SSMB29 సెట్స్ నుంచి మీకు ధన్యవాదాలు" అంటూ ఉన్న నోట్ కింద రాజమౌళి, ప్రియాంక చోప్రా సంతకాలు ఉన్నాయి. ఇప్పుడు ఈ నోట్‌ని షేర్ చేస్తూ మహేష్ ఫ్యాన్స్ తెగ పోస్టులు పెడుతున్నారు. ఇప్పటికైనా అర్థమైందా ఇది SSMB29 యే. ఇంకోసారి ఎవరూ కూతలు కూయాల్సిన అవసరం లేదంటూ వార్నింగ్‌లు ఇస్తున్నారు.

మరోవైపు ఈ ఫొటోల్లో మహేష్ బాబు కూడా కనిపించారు. బ్లూ కలర్ టీ షర్ట్ వేసుకొని, గ్లాసెస్, క్యాప్ పెట్టుకొని మహేష్ కనిపించారు. ఇందులో పొడవాటి జుట్టు, లైట్‌గా గడ్డంతో మహేష్ ఉన్నారు. మరి ఒడిశా షెడ్యూల్ పూర్తి కావడంతో తర్వాతి షెడ్యూల్ ఎక్కడా అంటూ ఫ్యాన్స్ పోస్టులు పెడుతున్నారు. మరోవైపు షూటింగ్‌పై రాజమౌళి అధికారిక ప్రకటన చేస్తే బావుంటుంది అంటూ కోరుతున్నారు. వచ్చే ఏడాది ఈ సినిమాని రిలీజ్ చేసేందుకు రాజమౌళి ప్లాన్ చేస్తున్నారట. కానీ జక్కన్న ప్లానింగ్ నిజమవుతుందో చూడాలి.

# ఇది నిజమైన బ్లాక్ బస్టర్



2024 జూన్ 05న ఐఎస్ఎస్‌కి వెళ్లిన సునీతా విలియమ్స్, విల్మోర్‌లు ఎనిమిది రోజుల్లో తిరిగి రావాల్సి ఉండగా.. ఏకంగా 286 రోజుల పాటు అక్కడే ఉండాల్సిన పరిస్థితి వచ్చింది. తిరిగి నేడు (మార్చి 19)న భూమికి చేరుకున్నారు.

నాసా వ్యోమగామి సునీతా విలియమ్స్, ఆమె సహచరుడు బుచ్ విల్‌మోర్‌లు 9 నెలల నిరీక్షణ తరువాత సురక్షితంగా భూమికి చేరుకున్నారు. ఈ ఇద్దరు వ్యోమగాములను అంతరిక్ష కేంద్రం నుంచి భూమికి తీసుకుని వచ్చేందుకు నాసా-స్పేస్‌ఎక్స్ సంయుక్తంగా క్రూ-10 మిషన్ చేపట్టి విజయవంతం అయ్యారు. ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్ నుంచి మంగళవారం తిరుగుప్రయాణమైన సునీతా విలియమ్స్.. భారత కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారుజామున 3:27కి ఫ్లోరిడా తీరంలో సురక్షితంగా ల్యాండ్ అయ్యారు.

వ్యోమనౌక మొరాయించడంతో తొమ్మిది నెలలుగా అంతరిక్షంలోనే ఉండిపోయిన సునీత విలియమ్స్.. దివి నుంచి భువికి సురక్షితంగా చేరుకోవడంతో దేశ వ్యాప్యంగా ఆమెకు స్వాగతం పలుకుతున్నారు. ఈ సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి.. సునీత విలియమ్స్‌కి స్వాగతం పలుకుతూ.. ఇద్దరు వ్యోమగామిలకు భగతంతుడు మరింత శక్తి ఇవ్వాలని.. ఇది నిజమైన బ్లాక్ బస్టర్ అని కొనియాడుతూ ట్వీట్ చేశారు.

సుదీర్ఘ నిరీక్షణ తరువాత.. దివి నుంచి భువికి చేరిన సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్‌లకు స్వాగతం. ఇది ప్రపంచ చరిత్రలోనే చారిత్రక ఘట్టం. ఎనిమిది రోజుల్లో తిరిగిరావాలని స్పేస్ స్టేషన్‌కి వెళ్లి 286 రోజులకు తర్వాత భూమికి చేరుకున్నారు. ఈ 286 రోజుల్లో.. 4577 సార్లు భూమి చుట్టూ తిరిగారు కానీ ఆశ్చర్యకరమైన రీతిలో భూమిని చేరుకోలేకపోయారు. వీరి ప్రయాణం ఒక థ్రిల్లర్ అడ్వెంచర్ మూవీని తలపిస్తోంది.. ఇదో గొప్ప సాహస యాత్ర.. అసలుసిసలు బ్లాక్ బస్టర్.. వీరికి సాటే లేదు.. సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్‌లు గొప్ప ధైర్యవంతులు' అని కొనియాడారు మెగాస్టార్ చిరంజీవి.

నిజంగానే మెగాస్టార్ చిరంజీవి అన్నట్టుగా.. ఈ 286 రోజులు సాహస యాత్ర నిజంగానే ఒక థ్రిల్లర్ అడ్వెంచర్. ఈ సాహస యాత్రలో వాళ్లు ఎదుర్కొన్న ఇబ్బందులు, ధైర్య సాహసాలపై సినిమా వచ్చినా రావచ్చు. మెగాస్టార్ అన్నట్టుగా నిజమైన బ్లాక్ బస్టర్ అయ్యే అవకాశమూ లేకపోలేదు.

ఇప్పటికే అంతరిక్షం నేపథ్యంలో హాలీవుడ్, బాలీవుడ్‌తో పాటు టాలీవుడ్‌లోనూ చాలా సినిమాలు వచ్చాయి. హాలీవుడ్‌లో హైలైఫ్, ఇంటర్స్టెల్లార్ , గ్రావిటీ, అపోలో 13 లాంటి సినిమాలు వచ్చాయి. వీటితో పాటు మిషన్ మంగళ్, రాకెట్రీ ది నంబీ ఎఫెక్ట్, రాకెట్ బాయ్స్, అంతరిక్షం 9000 వంటి సినిమాలు కూడా అందుబాటులో ఉన్నాయి. ఇక టాలీవుడ్‌లో అంతరిక్షం నేపథ్యంలో వచ్చిన సినిమాలు చాలా తక్కువ. వాటిలో వరుణ్ తేజ్, అదితి రావు హైదరీ నటించిన 'అంతరిక్షం 9000 %ఖఫీాం%' ఒకటి. హై టెక్నికల్ వాల్యూస్‌తో రూపొందించిన ఈ సినిమా 2018లో విడుదలైంది. విమర్శకుల ప్రశంసల్ని అయితే అందుకుంది కానీ.. బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ కాలేకపోయింది. ఇప్పుడు సునీతా విలియమ్స్ సాహసయాత్రపై మన టాలీవుడ్ అగ్ర దర్శకులు గురిపెట్టి బ్లాక్ బస్టర్ కొడతారేమో చూడాలి మరి.

# కోట్లు కొల్లగొట్టిన 'కోర్ట్'..



కంటెంట్ ఉన్న సినిమాలను ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తూనే ఉంటారు. హీరో, హీరోయిన్లు, బడ్జెట్, పాటలు, ఫైట్లు ఈవేం పట్టించుకోరు. సినిమాలో విషయం ఉందా లేదా అనే చూస్తారు. సినిమా నచ్చిందంటే లెక్కలకు మించే అఖండ విజయాన్ని అందిస్తుంటారు తెలుగు ఆడియన్స్. తాజాగా 'కోర్ట్' సినిమాకి కూడా అలాంటి విజయాన్నే అందించారు. ప్రియదర్శి హీరోగా నటించిన 'కోర్ట్' మూవీ మార్చి 14 విడుదలైన సూపర్ హిట్ టాక్‌ని సొంతం చేసుకుంది. ఈ మూవీ కలెక్షన్ల విషయానికి వస్తే..

'కోర్టు' కేసులంటేనే వాయిదాలు, విరామాలు ఉంటాయి. కానీ.. 'కోర్ట్' సినిమా మాత్రం బాక్సాఫీస్ వద్ద వాయిదాల్లేకుండా కలెక్షన్ల వర్షం కురిపిస్తుంది. హీరో నాని సొంత నిర్మాణంలో 'కోర్ట్'- స్టేట్ వర్సెస్ ఎ నోబడీ' చిత్రానికి రామ్ జగదీష్ దర్శకత్వం వహించారు. మంచి అంచనాలతో మార్చి 14న థియేటర్స్‌లో విడుదలైన ఈ సినిమాకి బ్లాక్ బస్టర్ హిట్ టాక్ రావడంతో.. రెండే రెండు రోజుల్లో బ్రేక్ ఈవెన్ సాధించింది.

మొత్తంగా ఐదురోజుల్లో అనూహ్య రీతిలో 33.55 కోట్ల గ్రాస్ కలెక్షన్లను రాబట్టి.. స్మాల్ బడ్జెట్ మూవీ విత్ బిగ్ కలెక్షన్స్ దిశగా అడుగులు వేస్తోంది. తొలిరోజు నుంచి బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది 'కోర్ట్'. కేవలం రూ.11 కోట్ల బడ్జెట్ (దాదాపుగా)తో రూపొందించిన ఈ సినిమా తొలిరోజు రూ.8.10 కోట్ల గ్రాస్ కలెక్షన్లు రాబట్టింది. ఇక రెండోరోజు రూ.15.90 కోట్లకి చేరుకుని బ్రేక్ ఈవెన్ సాధించింది. ఇక మూడోరోజు రూ.24.04 కోట్లు కలెక్షన్లు రాబట్టగా నాలుగో రోజు రూ. 28.09 కోట్లకు చేరింది.

ఇక ఐదోరోజు అదే హవానికి కొనసాగిస్తూ.. రూ.33.55 కోట్ల కలెక్షన్లను రాబట్టింది. ముఖ్యంగా వీకెండ్‌లో అయితే కోర్ట్ సినిమా హౌస్ ఫుల్ కలెక్షన్లతో నడుస్తుందంటే ఈ సినిమా మరో రెండు వారాల్లో రూ.50 కోట్ల కలెక్షన్లకు రీచ్ కావడం ఖాయంగానే కనిపిస్తుంది.

ప్రస్తుతం థియేటర్స్‌లో పెద్దగా సినిమాలేవీ లేకపోవడంతో పాటు.. ఈ శుక్రవారం కూడా చిన్నా చితకా సినిమాలు తప్పితే.. పెద్ద హీరోల సినిమాలు లేకపోవడంతో 'కోర్ట్' సినిమాకి థియేటర్స్‌కి కరువయ్యే పరిస్థితి అయితే లేదు. బ్లాక్ బస్టర్ హిట్ టాక్ వచ్చిన సినిమాని తీసేసి.. వేరే సినిమాని వేసే సాహసం అయితే చేయరు కాబట్టి.. రెండోవారంలోనూ 'కోర్ట్' కలెక్షన్లు ఊపందుకునే అవకాశం ఉంది.

కోర్ట్ సినిమాలో ప్రియదర్శి లాయర్‌గా లీడ్ రోల్ చేశారు. హర్ష్ రోషన్, శ్రీదేవిలు హీరో హీరోయిన్లుగా నటించారు. సీనియర్ నటుడు శివాజీ.. మంగపతి పాత్రలో విలనిజం పండించారు. ఈ సినిమా చూసిన తరువాత.. హీరో హీరోయిన్‌ల గురించి ఏ విధంగా అయితే చెప్పుకుంటారు.. అంతకుమించి మంగపతి పాత్ర గురించి చెప్పుకునేంతగా భయపెట్టేశాడు శివాజీ. పాతికేళ్లుగా ఇటువంటి పాత్ర కోసం ఎదురుచూస్తున్న శివాజీ.. మంగపతి పాత్రలో నటించడం కాదు జీవించేశాడు. ఇక సినిమాలో కనిపించే ప్రతి పాత్ర కూడా చాలా కీలకమే. హర్షవర్ధన్, రోహిణి, శుభలేఖ సుధాకర్ ఇంపార్టెంట్ రోల్ ప్లే చేశారు.

ఈ సినిమాకి ప్రాణం అంటే.. కాకినాడు కుర్రాడు విజయ్ బుల్గానీ (%ఎఱయిఖఱ దీఖశ్రీస్తుఱఅఱఅ%) ఇచ్చిన మ్యూజిక్. 'ప్రేమలో' అంటూ తన పాటతో ప్రేమ మత్తులోకి లాగేశాడు. బేబీ సినిమాకి చాట్ బస్టర్ మ్యూజికల్ హిట్ ఇచ్చి ఆ సినిమా విజయంలో కీ రోల్ పోషించిన సంగీత దర్శకుడు విజయ్ బుల్గానీ.. 'కోర్ట్' సినిమాతో మరో విజయాన్ని తన

# నీ పుట్టినరోజుకి దగ్గర లేను..



నటుడు మోహన్ బాబు పుట్టినరోజు సందర్భంగా సోషల్ మీడియాలో అభిమానులు విషెస్ తెలియజేస్తున్నారు. మంచు విష్ణు అయితే కన్నప్ప నుంచి మోహన్ బాబు పాత్రకి సంబంధించిన పోస్టర్ రిలీజ్ చేసి విషెస్ తెలిపారు. మరోవైపు మంచు మనోజ్ తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో మోహన్ బాబుపై ఓ ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. మిస్ యూ నాన్న.. నీ పుట్టినరోజుకి నీ దగ్గర ఉండలేకపోయా అంటూ మనోజ్ పెట్టిన ఇన్‌స్టా పోస్ట్ వైరల్ అవుతోంది.

కొంతకాలంగా మంచు ఫ్యామిలీ మధ్య వివాదం నడుస్తున్న సంగతి తెలిసిందే. చివరికి ఈ పంచాయితీ మీడియా ఛానల్స్ నుంచి పోలీస్ స్టేషన్ వరకూ వెళ్లింది. మంచు విష్ణు, మోహన్ బాబు ఓవైపు ఉంటే మనోజ్ తన భార్యతో కలిసి ఇంట్లో నుంచి బయటికి వచ్చేశారు. ఇక తాజాగా మోహన్ బాబు పుట్టినరోజు సందర్భంగా మనోజ్ ఆసక్తికర పోస్ట్ పెట్టారు.

"హ్యాపీ బర్త్‌డే నాన్న.. మనమంతా కలిసి వేడుక చేసుకునే ఈరోజు మీ పక్కన నేను ఉండే అవకాశాన్ని కోల్పోయా. మీతో మళ్లీ కలిసి ఉండే క్షణాల కోసం ఎదురుచూస్తున్నా. లవ్ యూ" అంటూ మంచు మనోజ్ పోస్ట్ పెట్టారు. ఇందులో మోహన్ బాబు పాత ఫొటోతో పాటు, తన తండ్రితో చిన్నప్పుడు గడిపిన క్షణాలని కలిపి ఓ వీడియోని కూడా జత చేశారు మనోజ్.

మరోవైపు, మంచు లక్ష్మి కూడా మోహన్ బాబుకి సోషల్ మీడియాలో శుభాకాంక్షలు చెప్పారు. "హ్యాపీ బర్త్‌డే నాన్న.. మీరు ఆయురారోగ్యాలతో ఎప్పుడూ సంతోషంగా ఉండాలని ఆ దేవుడిని ఎల్లప్పుడూ ప్రార్థిస్తుంటా" అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో స్టోరీ పెట్టారు మంచు లక్ష్మి.

మంచు కుటుంబంలో కొంతకాలంగా ఆస్తి వివాదాలు జరుగుతున్నాయి. తాను కష్టపడి సంపాదించి కట్టిన ఇల్లు, ఆస్తులను మనోజ్ ఆక్రమించాడంటూ మోహన్‌బాబు ఏకంగా రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేశారు. తన మనుషులతో కలిసి ఇంటిని ఆక్రమించుకునేందుకు దౌర్జన్యం చేశాడని.. అడ్డొచ్చిన తమ మనుషులని కొట్టాడంటూ మోహన్ బాబు ఈ ఫిర్యాదులో తెలియజేశారు. అలానే మనోజ్ గురించి మీడియాకి కూడా ఓ బహిరంగ లేఖ విడుదల చేశారు.

అలానే తన అన్న విష్ణుతో కూడా మనోజ్‌కి గొడవ జరుగుతోంది. ఇటీవలే ఇద్దరూ సోషల్ మీడియాలో తిట్టుకున్న సంగతి తెలిసిందే. ఇండైరెక్ట్‌గా సినిమా డైలాగులు పోస్ట్ చేసుకొని ఒకరినొకరు పరస్పరం ధూషించుకున్నారు. కన్నప్ప సినిమాపై కూడా మనోజ్ విమర్శలు చేసిన సంగతి తెలిసిందే. ఉన్న ఆస్తి మొత్తం ఆ సినిమాకి పెట్టడం ఎంత వరకూ న్యాయం అంటూ మనోజ్ ప్రశ్నిస్తున్నారు. ఇప్పుడు తాజాగా కన్నప్పకి పోటీగా తన భైరవం చిత్రాన్ని మనోజ్ రిలీజ్ చేయబోతున్నారంటూ టాక్ నడుస్తోంది. మరి ఇద్దరు అన్నదమ్ముల మధ్య ఈ పోరాటం ఎంత వరకూ వెళ్తుందో అంటూ ఫ్యాన్స్ టెన్షన్ పడుతున్నారు.

అయిందేదో అయిపోయింది మనోజ్‌ని మళ్లీ ఇంటికి పిలిచి దగ్గరికి చేర్చుకోవాలంటూ మోహన్ బాబుని కోరుతూ పోస్టులు పెడుతున్నారు ఫ్యాన్స్. మరోవైపు విష్ణు కూడా పలు ఇంటర్వ్యూల్లో మనోజ్‌తో పంచాయితీ గురించి రియాక్ట్ అవుతున్నారు.







ప్రగ్యా జైస్వాల్ స్టైలిష్ లుక్.. జిమ్‌లో హంస నందిని.. మీనాక్షి గ్లామర్ షో
ప్రగ్యా జైస్వాల్ స్టైలిష్ లుక్.. జిమ్‌లో హంస నందిని.. మీనాక్షి గ్లామర్ షో
వెండితెర ముద్దుగుమ్మలు లేటెస్ట్‌గా ఇన్‌స్టాగ్రామ్‌లో అప్‌డేట్స్ మీకోసం డాకు మహారాజ్ హీరోయిన్ ప్రగ్యా జైస్వాల్ స్టైలిష్ లుక్‌లో ఇచ్చిపడేసింది.
హంస నందిని జిమ్‌లో కసరత్తులు చేస్తూ ఫొటోలు షేర్ చేసింది.
సంక్రాంతికి వస్తున్నాం ఫేమ్ మీనాక్షి చౌదరి ఓ ఈవెంట్‌లో రెడ్ కలర్ డ్రెస్‌లో మెరిసింది. శోభిత ధూళిపాళ్ల నాగ చైతన్యతో కలిసి ఓ మ్యాగజైన్ కవర్ పేజీ కోసం పోజులిచ్చింది. మాళవిక మోహనన్.. మోహన్ లాల్‌తో చేస్తున్న సినిమా షూటింగ్ అప్‌డేట్ ఇచ్చింది.
రాశి ఖన్నా ఫుడ్‌ని ఎంజాయ్ చేస్తూ ఓ స్పెషల్ పోస్ట్ పెట్టింది.
శ్రద్ధా దాస్ క్యారవాన్ నుంచి స్టైల్‌గా దిగుతూ ఓ రీల్ చేసింది.
శ్రియ శరణ్ తన భర్తని తొలిసారి ఇలానే కలిశానంటూ జ్ఞాపకాలు పంచుకుంది. సిమ్రాన్ చౌదరి తన ఫ్రెండ్స్‌తో కలిసి అడ్వెంచరస్ ట్రిప్ ఎంజాయ్ చేస్తుంది. వీరితో పాటు మిగిలిన బ్యూటీలు షేర్ చేసిన విశేషాలపైనా ఓ లుక్కేద్దాం.